...21వ పేజీ తరువాయి

దుస్తుల డిజైనర్లు, టైలర్లు, కస్టమర్లు మొదలైనవారు ఇప్పుడు దీనిపైనే దృష్టి కేంద్రీకరించారు. 'ఈనాటి ప్రపంచంలో చీర బ్లౌజు మహిళ స్టైల్ ఏమిటో చెబుతుంది' అని ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ రీతూ కుమార్ అన్నారు. 'ఈనాటి మహిళ తుదకు తాను ధరించే చీర బ్లౌజు ద్వారా కూడా బాహ్య ప్రపంచానికి ఏదో చెప్పదలచుకుంటున్నది. అది అందంగా చేసే ప్రకటన' అని ఆమె అన్నారు.

మెడ పైవరకు, మోచేతి కింద వరకు ఉన్న బ్లౌజు ధరించే రోజులు గతించాయి. బాలీవుడ్‌లో అనుసరిస్తున్న నెక్‌లైన్లను రీతూ కుమార్ ఉదాహరణగా ప్రస్తావిస్తూ, 'ఇప్పటి ధోరణి ఎంత తక్కువైతే అంత బాగుంటుంది అనేదే. మరి ఎందుకు కాదు? మీరు చక్కని రూపలావణ్యాలు గలవారైనప్పుడు దానిని ప్రదర్శించవచ్చు గదా!' అని అన్నారు. ఇక కాలగతిలోకి వెళితే, రవి వర్మ చిత్రించిన నాయర్ మహిళ బ్లౌజు లేకుండా చీర లేదా 'ముండు' ధరించి ఉంటుంది. 'పూర్వ కాలంలో మహిళలు బ్లౌజులు ధరించేవారు కాదు' అని 85 సంవత్సరాల రాజమ్మ చెప్పారు. మరి రాజమ్మ తన విద్యార్థిని జీవితంలో చెన్నై లో మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ఫ్యాషన్ పరంగా ఒక ట్రెండ్‌సెట్టర్ అయ్యారు. 'మేము 1950 దశకంలో ప్రింటెడ్ బ్లౌజులు ధరించాం' అని ఆమె తెలియజేశారు. ఇక భారతీయ బ్లౌజు గురించి పూర్వపు ఉదాహరణగా 'కచూళి'ని పేర్కొనాలి. అది ఛాతీని కప్పుతూ వెనుక వైపు ముడి వేసే ఒక వస్త్రం. ఆ నాటి నుంచి క్రమంగా మార్పులకు లోనవుతూ వెనుక ఖాళీగా ఉండే (బ్యాక్‌లెస్) చోళీలు చోటు చేసుకున్నాయి.

ఆ తరువాత లండన్ వీధులలోని ఫ్యాషన్ ధోరణుల స్ఫూర్తితో లేసులతో కూడిన పూర్తి చేతుల బ్లౌజులు రాజ్యమేలాయి. 1950, 1960 దశకాల నాటి బ్లౌజుల గురించి రాజమ్మ చెబుతుంటారు. అవి చాలా సాదా సీదాగా పొడుగు చేతులవై ఉండేవని ఆమె తెలిపారు. 'వహీదా రెహ్మాన్, సురయ్యాలో మాకు స్ఫూర్తి. 1950 దశకం మౌళికంగా సంప్రదాయాన్ని పాటించిన కాలం. వికృతమైనవి గాని, రిస్కీవి గాని కనిపించేవి కావు' అని రాజమ్మ చెప్పారు. అందువల్లే హిట్ చిత్రం 'పరిణీత'లో హీరోయిన్ విద్యా బాలన్ 1950 దశకం నాటి మహిళను దృష్టిలో ఉంచుకుని బుట్ట చేతుల (పఫ్-స్లీవ్‌డ్) బ్లౌజులు ధరించి స్త్రీత్వానికి ప్రతినిధిగా కనిపించింది.

ఇక అంతా వేగమయం అయిన ఈ (2005) కాలానికి వస్తే, చీర బ్లౌజు కనీస స్థాయిలో మార్పునకు గురైంది. ఉదాహరణకు, టివిలో మందిరా బేడి ధరించే బ్లౌజులు పారదర్శకంగా ఉండేవే. ఆమె హాల్టర్ టాప్ ధరించి, ఏడాదిలో 365 రోజులూ వేసవినే గుర్తు చేయవచ్చు లేదా స్టైల్‌ను వెల్లడించే క్లాసీ బ్యాక్‌లెస్ (వెనుక తాడుతో ముడివేసే ) బ్లౌజును ధరించవచ్చు.



ప్రస్తుతం పాశ్చాత్య బ్లౌజ్ ట్రెండ్‌లు చీర బ్లౌజు డిజైన్లను ప్రభావితం చేస్తున్నాయి. అందువల్ల, హాల్టర్ నెక్‌లు, బ్యాక్‌లెస్ చోళీలు, లో యు నెక్‌లు, బోట్ నెక్‌లు, ఆఫ్-ది-షోల్డర్ (భుజాన్ని కప్పనివి), వీపును, ఛాతీ వంపులను చూపే బాగా కొట్టవచ్చినట్లుండే డిజైన్లు -- చీర బ్లౌజు తాజా రూపాలయ్యాయి.

డిజైనర్ రీతూ బెరి శాటిన్ చీరలకు ఎంబ్రాయిడరీ చేసిన లేస్ బ్లౌజులను జత చేశారు. ఆమె రూపొందించినవాటిలో హాల్టర్ నెక్‌లు, బ్యాక్‌లెస్ చోళీలు, సాంప్రదాయిక రౌండ్-నెక్, స్ట్రింగ్స్, కీ-హోల్స్, చిక్కని ఎంబ్రాయిడరీ వంటి అలంకరణలతో పొట్టి చేతుల బ్లౌజులు కూడా ఉన్నాయి. 'ఎంబ్రాయిడరీకి ఒక కాలం అంటూ లేదు' అని రీతూ బెరి అంటారు. ఆమె అన్ని రకాల ఎంబ్రాయిడరీని ఉపయోగిస్తుంటారు. దుస్తులకు రకరకాల మెరుగులు దిద్దితే ఉపయోగం ఉంటుందని ఆమె భావన.

మరి ఈ రోజులకు ఏ దుస్తులు ఫ్యాషన్‌గా ఉన్నాయి? 'మహిళలు చేనేత కాటన్, షిఫాన్, జార్జెట్, చల్లటి సమయాలైతే వెల్వెట్, ఇక ఎప్పటికీ అందంగా భాసించే పట్టు వస్త్రాల కోసం చూస్తుంటారు' అని రీతూ కుమార్ చెప్పారు. ప్రస్తుతం, ముతక, విభిన్నమైన, మోత్రా, లెహెరియా ప్రింట్లలో ఆఫ్-షోల్డర్ బ్లౌజులు, చీరలతో భారీగా ఎంబ్రాయిడరీ చేసిన సెట్లు ఆమె వద్ద లభిస్తున్నాయి. 'ఫ్యాషన్ అంతా మూడ్ (మనసు)కు సంబంధించినదే' అని రీతూ పేర్కొన్నారు. 'ఒక రోజు అది ప్రాచీనం. మరునాడు అది సాఫ్ట్, రొమాంటిక్, మరొక రోజు వేడుక సమయంగా ఉంటుంది. అందువల్ల, మూడ్‌కు, సందర్భానికి తగినట్లుగా ఉంటుంది' అని ఆమె అన్నారు. ఏ మూడ్ అయినా, సందర్భమైనా సరే... చీర బ్లౌజు మళ్ళీ రాజ్యమేలుతున్నదనడంలో సందేహం లేదు.